క్లుప్తంగా

బీసీల మహాధర్నాకు మద్దతు



కృష్ణయ్యకు మద్దతు తెలుపుతున్న శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: బీసీల హక్కుల కోసం ఢిల్లీలో ఆర్.కృష్ణయ్య చేపట్టబోతున్న మహాధర్నాకు మంచిర్యాలకు చెందిన బీసీ నాయకులు తోట శ్రీనివాస్ మంగళవారం కలిసి తన మద్దతును తెలిపారు. కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్ ప్రవేశపెట్టి ఎంపీ, ఎమ్మెల్యే కోటాలో 50శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌తో ఈ మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: నస్పూర్ పట్టణ పరిధిలోని నస్పూర్ శివారు 64సర్వే నంబరులో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి పరిరక్షించాలని కోరుతూ నస్పూర్‌కు చెందిన జి శ్రీనివాస్, ఆర్ శ్రీనివాస్ మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మధుసూధన్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై అధికారులు విచారణ జరిపి అక్రమకట్టడాలను కూల్చివేయించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరారు.

నేటి నుంచి దివ్యాంగులకు బస్‌పాసుల జారీ

చెన్నూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ నెల 5(బుధవారం)నుంచి 7వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బస్‌పాసులు జారీ చేయనున్నట్లు ఆర్టీసీ కంట్రోలర్ శేషరెడ్డి తెలిపారు. 8, 10, 11 తేదీల్లో కోటపల్లి ఎంపీడీవో కార్యాలయం, 12, 13, 14 తేదీల్లో వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బస్‌పాసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. బస్‌పాస్ కోసం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ ఒరిజినల్‌తో పాటు జిరాక్స్, ఆధార్ జిరాక్స్, పాస్‌లు తీసుకొని రావాలని పేర్కొన్నారు. బస్‌పాస్ కోసం రూ.50చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఈ కింది ఫోన్ నంబర్లు 7382841927, 8897010895కు సంప్రదించాలని కోరారు.

కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమిని/భీమారం: కంటివెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కన్నెపల్లి జెడ్పీటీసీ సత్యనారాయణ, భీమారంలో ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. కన్నెపల్లి మండలంలో జెడ్పీటీసీ కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ప్రారంభించగా, భీమారం మండలం ఎలకేశ్వరంలో ఎంపీడీవో కంటి వెలుగును తనిఖీ చేశారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం టీకానపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం సర్పంచ్ రాంటెంకి మల్లేశ్వరి ప్రారంభించారు.

ముగిసిన కంటి వెలుగు శిబిరం

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 28వ వార్డులో నిర్వహించిన కంటి వెలుగు శిబిరం మంగళవారంతో ముగిసింది. వార్డు కౌన్సిలర్ సాయిభార్గవి కంటి వెలుగులో వైద్య సేవలు అందించిన వైద్యులు, వైద్య సిబ్బందిని, అంగన్‌వాడీ టీచర్లను సన్మానించి, సేవలను కొనియాడారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

జన్నారం: మండలంలోని కవ్వాల్‌లో మతసామరస్యం వెల్లివిరిసింది. గ్రామంలోని ముస్లింలకు, హనుమాన్ దీక్ష పరుడు అమరగొండ తిరుపతి ఆధ్వర్యంలో స్వాములందరూ కలిసి ముస్లింలకు మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా స్వీకరించారు.

'మా గ్రామంలో వైకుంఠ ధామం నిర్మించొద్దు'



రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమరవాది గ్రామ శివారులో నిర్మించే వైకుంఠధామాన్ని తమ గ్రామ పరిధిలో కాకుండా, వేరే చోట నిర్మించాలని అమరవాది గ్రామస్తులు పలువురు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. సర్వే నెంబరు 15లో నిర్మించే వైకుంఠధామం స్థలంలో తమ గ్రామదేవతను గతంలో ప్రతిష్ఠించామని, అంతేకాకుండా చుట్టూ పంట భూములు ఉన్నందునా వైకుంఠధామం కారణంగా రైతులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.

అభివృద్ధి మందగమనం!

చెన్నూర్ నియోజకవర్గం పరిధిలోని రామకృష్ణాపూర్‌లో అభివృద్ధి పనులు లెక్కకు మించి అమల్లోకి వస్తున్నాయి. ఊహించని విధంగా పనులు మంజూరయ్యాయనే సంతోషం పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతోంది. అయితే ఇదే సమయంలో కొన్ని పనులు కుంటి నడకన సాగుతున్న తీరు అసంతృప్తికి గురిచేస్తోంది. శంకుస్థాపన చేసిన, ఇప్పటికే మొదలైన పనులు వేగిరం పుంజుకుంటే ఇక అభివృద్ధి కొత్త పుంతలు తొక్కినట్లేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వ విప్ ఒకింత నత్తనడకన సాగుతున్న పనులపై దృష్టి సారించాలనే అభిప్రాయాల నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.. – రామకృష్ణాపూర్



పూర్తి కావాల్సి ఉన్న రైల్వేబ్రిడ్జి



అధ్వానంగా క్యాతనపల్లి-ఆర్‌కేపీ ప్రధాన రోడ్డు

- సబ్‌స్టేషన్, రైల్వేబ్రిడ్జి పనులు మాత్రమే ఆశాజనకం
- నిరుత్సాహపరుస్తున్న ప్రధాన, అంతర్గత రోడ్లు
- ఇంకా మొదలవ్వని మినీ ట్యాంక్‌బండ్ పనులు
- అంబేద్కర్ పార్క్‌దీ అదే పరిస్థితి
- త్వరితగతిన పూర్తయితే అభివృద్ధి పుంతలు తొక్కినట్టే..

త్వరలోనే పనులు పూర్తిచేస్తాం

క్యాతనపల్లి మినీ ట్యాంక్‌బండ్‌కు సంబంధించి టెక్నికల్ సాంక్షన్ రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. పట్టణంలో కొన్ని ప్రధాన రోడ్ల పనులు ఈ వర్షాకాలంలోగా పూర్తి చేసేలా చూస్తాం. రోడ్డు వెడల్పు పనులు కూడా త్వరలోనే చేపడుతాం.

– అచ్యుత్, ఏఈ, మందమర్రి

రామకృష్ణాపూర్ పట్టణంలో రైల్వే బ్రిడ్జి, సబ్‌స్టేషన్, మినీ ట్యాంక్‌బండ్, అంబేద్కర్ పార్క్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఓపెన్‌జిమ్ తదితర పనులకు శ్రీకారం చుట్టి, శంకుస్థాపన చేశారు. వీటిలో కొన్ని ఆశించిన స్థాయి కంటే వేగంగా కొనసాగుతుండగా, మిగిలినవి నత్తనడకన జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. ప్రధానంగా క్యాతనపల్లి కమాన్ నుంచి పట్టణాన్ని అనుసంధానం చేసే ప్రధాన రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. క్యాతనపల్లి నుంచి విఠల్‌నగర్ మీదుగా రైల్వేస్టేషన్, సూపర్‌బజార్ వెళ్లే రోడ్డు మార్గం మరీ అధ్వానంగా ఉంది. పూర్తిగా శిథిలమైన ఈ రోడ్లతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఇదే క్యాతనపల్లి నుంచి బీజోన్ రాజీవ్‌చౌక్ వెళ్లే రోడ్డు దుస్థితి అంతే. ఇక పట్టణంలో అంతర్గత రోడ్లు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయి.

నత్తనడకన మరికొన్ని పనులు...

అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన పలు పనులు అసంతృప్తి కలిగిస్తున్నాయని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా 2వ వార్డులో శంకుస్థాపన చేసిన అంబేద్కర్ పార్కు పనులు మందగించటం గమనార్హం. మొదట్లో పనులు ప్రారంభించి భూమి చదును చేసినప్పటికీ మళ్లీ పిచ్చి మొక్కలు మొలిచి యథావిధి స్థాయిలోనే ఉన్నాయి. భూమి చదును కోసం రూ.10లక్షలు వెచ్చించి పనులు ప్రారంభించినా మళ్లీ పిచ్చిమొక్కలు మొలవడంతో ఆ పది లక్షలు కాస్త వృథా అయ్యాయని ప్రజలు వాపోతున్నారు. క్యాతనపల్లి చెరువుపై ఏర్పాటు చేయాల్సిన మినీ ట్యాంక్‌బండ్ పనులు ఇంకా ప్రారంభమే కాలేదని ప్రజలు వాపోతున్నారు. గతంలో చేపట్టిన మంచిర్యాల వెళ్లే రైల్వే బ్రిడ్జి నిర్మాణం కూడా త్వరగా పూర్తయ్యేలా చొరవతీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అప్పుడే ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి పనులకు సార్థకత లభిస్తుందని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే బ్రిడ్జి, సబ్‌స్టేషన్ ఓకే...

క్యాతనపల్లి రైల్వేగేటు వద్ద చేపట్టిన రైల్వేబ్రిడ్జి పనులు దాదాపుగా పూర్తయ్యాయి. బ్రిడ్జి నిర్మాణంలో భూనిర్వాసితుల నుంచి అప్పట్లో ఇబ్బందులు తలెత్తగా ప్రభుత్వ విప్ బాల్కసుమన్ ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులకు సకాలంలో నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో బ్రిడ్జి ఆగమేఘాల మీద పూర్తిచేశారు. మరో 50మీటర్ల మేర బ్రిడ్జికి రెండు వైపులా రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. పట్టణంలోని శివాజీనగర్‌లో 33/11 కేవీ నూతన సబ్‌స్టేషన్ దాదాపు పూర్తికావొచ్చింది. అన్ని పనులు పూర్తయి నేడో, రేపో ప్రారంభానికి సిద్ధమనే స్థాయిలో ఉన్నాయి. ఇది ప్రారంభమైన పక్షంలో పట్టణంలో సుమారు 12వేల విద్యుత్ కనెక్షన్లతో పాటు దశాబ్దాల చీకటి రోజులకు స్వస్తిపలికే అవకాశముందని ప్రజలు చెబుతున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఆశాజనకంగా సాగుతుండటం విశేషం.

అనుమతి లేని రోడ్డు మూసివేత

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో ఏర్పాటు చేసిన వెంచర్‌కు అనుమతి లేకుండా జాతీయ రహదారి నుంచి రోడ్డు వేశారని, దీంతో రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందని వచ్చిన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. జాతీయ రహదారికి ఉన్న కాజ్ బారియర్‌ను తొలిగించి, అక్రమంగా రోడ్డు వేయడంపై మంచిర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలో మంగళవారం తొలిగించిన కాజ్ బారియర్ వద్ద ఇనుపరాడ్లను అడ్డుగా పెట్టి, వేసిన రోడ్డును జేసీబీతో తవ్వేశారు. కాజ్‌బారియర్‌ను తొలగించి, అక్రమంగా రోడ్డును వేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు నేషనల్ హైవే డీఈ అన్నయ్య తెలిపారు.



రోడ్డును మూసేసి, జేసీబీతో తవ్వేసిన అధికారులు

ఆలయ వార్షికోత్సవం





దండేపల్లి: మండలంలోని మేదరిపేట శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయ 6వ వార్షికోత్సవం మంగళవారం వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి కల్యాణవేడుక, హోమం, పూర్ణాహుతి, శ్రీచక్ర ప్రతిష్ఠాపణ పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బహిరంగసభను విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: మంచిర్యాలలో ఈ నెల 8న నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బహిరంగసభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పిలుపునిచ్చారు. ఏరియాలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవళిరెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. ఈ బహిరంగసభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్, మాజీ కేంద్రమంత్రి జైరాం రమేష్, టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులతో పాటు ఉద్యకారులు గద్దర్, హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రమేష్, రఘునాథరెడ్డి, ముజాయిద్, ఉపేందర్‌గౌడ్, సమ్మయ్య, నీలయ్య, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు సురేఖ

సంక్షిప్త వార్తలు

గురుకులం విద్యార్థికి గాయాలు

బెల్లంపల్లి: స్థానిక తెలంగాణ ప్రభుత్వ బాలుర గురుకుల విద్యాలయంలో మంగళవారం ఓ విద్యార్థి చేతికి తగిలిన స్వల్ప గాయాలు వివాదాస్పదమయ్యాయి. పదో తరగతి చదువుతున్న సాత్విక్ అనే విద్యార్థి, తనను ప్రిన్సిపాల్ కొట్టాడని ఆరోపించడంతో వివాదమైంది. విద్యార్థి తండ్రి సుధాకర్, కుటుంబీకులు, మరి కొందరు యువకులు గురుకులానికి వచ్చి ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకుని వాగ్వాదం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తాను సాత్విక్‌ను కొట్టలేదని స్పష్టం చేశారు. ఉదయం ప్రార్థన సమయం సమీపించడంతో ఆ విద్యార్థి ఆలస్యమవుతోందని గ్రహించి సహచర విద్యార్థులతో కలిసి పరుగెత్తుకుంటూ వచ్చి గ్రిల్‌కు చేయి తగలడంతో చేతికి గాయమైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి కుటుంబీకులతో పాటు యువకులు ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. నినాదాలు చేశారు. ఈ ఘటనపై విద్యార్థి తండ్రి తాళ్ల గురిజాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

నర్సరీ సందర్శన

భీమారం: మండలంలోని ఎలకేశ్వరంలో ఉపాధిహామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీని మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్ సందర్శించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వేమనపల్లి: మండలంలోని జక్కపల్లిలో రూ.15లక్షల గ్రామపంచాయతీ నిధులతో మంగళవారం వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

'సుమన్ పాలనలోనే భీమారం అభివృద్ధి'

భీమారం: చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్కసుమన్ పాలనలో భీమారం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజుకుమార్ అన్నారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దాంపూర్ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీవైస్ ఎంపీపీ సమ్మన్న, మాజీ జడ్పీటీసీ రాజుకుమార్, మాజీ ఎంపీటీసీ రాము, నాయకులు సురేశ్, పవన్, శంకర్, రాజాబాపు, పాల్గొన్నారు.

పట్టణ కమిటీ ఎన్నిక

చెన్నూర్: చెన్నూర్ పాత మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్ మండల కమిటీ అధ్యక్షుడు తగరం వెంకటి అధ్యక్షతన మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం చెన్నూర్ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా చకినారపు రాజేశ్ ఎన్నికయ్యారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

కోటపల్లి: అనుమతిలేని నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో మహేందర్ రైతులకు సూచించారు. దేవులవాడ రైతువేదికలో మంగళవారం రైతులకు నకిలీ విత్తనాలు, రైతుబంధు, రైతుబీమా, వరిలో ప్రస్తుతం వ్యాప్తి చెందే తెగుళ్లపై అవగాహన కల్పించారు.అనుమతి లేని విత్తనాలు అమ్మినా, ప్రోత్సహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవో రాజుకుమార్, సర్పంచ్ పానెం శంకర్, నాయకులు మల్లయ్య, వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కేంద్రం ప్రారంభం

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మంగళవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా, సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు జి.స్వరూపారాణి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీపీఆర్‌పై అవగాహన

దండేపల్లి: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, మండల వైద్యాధికారి సతీష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీసీలు, మండల పరిషత్ సిబ్బందికి, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశం, వీఆర్‌ఏలు, రేషన్ డీలర్లు, ఈజీఎస్ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

తాండూర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేయగా, బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామలదేవి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఆర్‌ఐ ఎజాజుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

'అందరి సహకారంతో అవార్డు దక్కింది'

నెన్నెల: అందరి సహకారంతోనే గొల్లపల్లికి రాష్ట్ర ఉత్తమ పంచాయతీగా అవార్డు దక్కిందని గొల్లపల్లి సర్పంచ్ ఇందూరి శశికళ అన్నారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామలతో కలిసి మంగళవారం గొల్లపల్లి పాలకవర్గ సభ్యులను ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్‌లను సన్మానించారు. గ్రామపంచాయతీలో పనిచేసే ఉద్యోగులను, పారిశుధ్య కార్మికులు, వీఆర్‌ఏలను సన్మానించారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.30
పచ్చిమిర్చి	60
చిక్కుడు కాయ	100
బీరకాయ	100
వంకాయ	50
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	50
దొండకాయ	70
సొరకాయ	30
ఆకుగోబి	50
పూగోబి	60
క్యారెట్	60
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	90

- మంచిర్యాలఅగ్రికల్చర్





శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

శిథిలభవనం.. తొలగిస్తేనే విశాలం

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది గదులు పూర్తి శిథిలావస్థకు చేరాయి. భవనం పిల్లర్ల లోపలి రాడ్లు బయట పడటంతో పాటు, పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. ప్రమాదం పొంచి ఉండటంతో వినియోగించడం లేదు. శిథిల భవనం వెనుక గత రెండేళ్ల క్రితం నాలుగు అదనపు తరగతి గదులను నిర్మించారు. అందులో తరగదులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు వెనక వైపు వెళ్లాలంటే శిథిలభవనం వరండాను దాటాలి. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన భవనం పాఠశాల గ్రౌండ్ మధ్యలో ఉంది. శిథిల భవనాన్ని తొలగిస్తే, పాఠశాల ఆటస్థలం విశాలంగా మారడంతో పాటు, విద్యార్థులు శిథిల గదులు దాటి వెళ్లాల్సిన అవసరం కూడా ఉండదు. శిథిలభవనం వెనకాల తరగతి గదులు ఉండటంతో, వెనకాల ఏం జరుగుతుందో కూడా ఉపాధ్యాయులు సరిగా పర్యవేక్షించలేని పరిస్థితి నెలకొంది. పాఠశాలను 'మనఊరు-మనబడి'తో పాటు పీఎంశ్రీ కి కూడా ఎంపిక చేశారు. ఈ రెండింటితో పాఠశాలను అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, పైగా పాఠశాల ఆటస్థలం మధ్యలో ఉన్న శిథిల భవనాన్ని తొలగించి, విశాలంగా చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



రాడ్లు తేలిన పిల్లర్లు, ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు

రోడ్డు నిర్మించాలని బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

కాసిపేట: మండలంలోని బుగ్గగూడెం గ్రామపంచాయతీలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సూరం సంపత్, ఉపాధ్యక్షుడు నరేష్, నాయకులు ఏదుల తిరుపతి, గ్రామస్తులు సోమని మహేష్, బాపు, ఉదయ్‌కుమార్, పల్లె సురేష్ మహిళలు తదితరులున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

మందులు అందజేత

మంచిర్యాలటౌన్: రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకులో విధులు నిర్వర్తిస్తున్న జీవీఆర్ మణికంఠ కూతురు మహిక జన్మదినాన్ని పురస్కరించుకుని తలసేమియా సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి నెలకు సరిపడా మందులను అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, బ్లడ్ బ్యాంక్ వైద్యుడు ఆర్. వంశీకృష్ణ పాల్గొన్నారు.

నర్సింగ్ కాలేజీ ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న నర్సింగ్ విద్యార్థిని

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఫ్రెషర్స్ డేను మంగళవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరంలో చేరిన 56మంది నర్సింగ్ విద్యార్థినులకు ఇటీవలే ప్రత్యక్ష తరగతులు ప్రారంభించారు. దీంతో విద్యార్థుల్లో ఉత్సాహం నింపడంతో పాటు, ఒకరికొకరి మధ్య స్నేహాన్ని నెలకొల్పేందుకు నిర్వహించిన ఈ ఫ్రెషర్స్‌డేలో విద్యార్థినులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాతిమా జూలియెట్, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, ఏవో రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ పద్మలత, డాక్టర్ వివేకవర్ధిని, నర్సింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



నర్సింగ్ విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ, సిబ్బంది